ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
శుక్రవారం 21 మార్చి 2025




ఉష్ణోగ్రత: గరిష్ఠం 39.7 కనిష్ఠం 18.1

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:57 (శనివారం ఉదయం)



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## కాంగ్రెస్‌తోనే గిరిజనుల అభ్యున్నతి

» శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గిరిజనులు, ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అనంతగిరిలో జిల్లా స్థాయి ఆదివాసీ కాంగ్రెస్ బునియాది కార్యకర్తల సమ్మేళనం ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. దీనికి హాజరైన స్పీకర్ మాట్లాడుతూ దేశంలో ప్రకృతి సంపదపై మొదటి హక్కు గిరిజనులదేనన్నారు. బడ్జెట్‌లో గిరిజనుల అభివృద్ధికి రూ.17,167 కోట్లు కేటాయిస్తే, రాజీవ్ యువ వికాసం పథకం కింద ట్రైకార్ ద్వారా నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు రూ.1,360 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, కాంగ్రెస్ ఆదివాసీ జాతీయ అధ్యక్షుడు విక్రాంత్ బురియా, ఆదివాసి కాంగ్రెస్ కన్వీనర్ రాహుల్ బల్‌జీ, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోలుకుంద సంతోష్‌కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రఘుపతిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, ఆర్టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ధారాసింగ్, సునీత పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పక్షపాతి

» బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణప్రసాద్


పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న లాల్‌కృష్ణప్రసాద్

పరిగి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతులని బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై అసెంబ్లీలో తీర్మానానికి కృషి చేసిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని గురువారం పరిగిలో ఘనంగా సన్మానించారు. అసెంబ్లీలో తీర్మానం తర్వాత మొదటిసారిగా పరిగికి వచ్చిన రామ్మోహన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా లాల్‌కృష్ణ మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్‌ముదిరాజ్, నాయకులు కృష్ణ, చిన్ననర్సింహులు, అంజనేయులు, జింకల యాదయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

» భగ్గుమంటున్న సీనియర్ నేతలు
» మూకుమ్మడిగా రాష్ట్ర కార్యాలయంలో నిరసన
» పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శికి ఫిర్యాదు
» మార్చే వరకూ వదిలిపెట్టేది లేదంటూ స్పష్టం
» అయోమయంలో పార్టీ కేడర్



### ఫిర్యాదు కోసం ఢిల్లీకి వెళ్లిన యువనేత

జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన రాజశేఖర్‌రెడ్డిని మార్చాలంటూ పార్టీకి చెందిన ఓ యువనేత ఢిల్లీకి వెళ్లి బీజేపీ ముఖ్య నేతలను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. స్థానికేతరులకు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఎలా ఇస్తారంటూ ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. కాగా, లోక్‌సభ సమావేశాల తర్వాతనే ఈ విషయం ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

# కమలంలో కల్లోలం!

## అగ్గి రాజేసిన జిల్లా అధ్యక్షుడి నియామకం

బీజేపీ జిల్లా అధ్యక్షుడి నియామకం కమలదళంలో కల్లోలం రేపింది. దశాబ్దాల కాలం నుంచి పార్టీకి విధేయులుగా ఉంటూ సేవలందిస్తున్న వారిని కాదని లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీలో చేరిన నాయకుడికి ఏ విధంగా జిల్లా అధ్యక్ష పదవి ఇస్తారంటూ స్థానిక నేతలు ప్రశ్నిస్తున్నారు. పార్టీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అధ్యక్షుడిని నియమించారంటూ మండిపడుతున్నారు. పార్టీ అధ్యక్షుడిని మార్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం పార్టీ సీనియర్ నాయకులు మూకుమ్మడిగా హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళ్లి కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

వికారాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీ ఎన్నికల నియమావళి ప్రకారం ఆరేళ్లుగా పార్టీలో కొనసాగుతూ రెండు పర్యాయాలు క్రియాశీల సభ్యులుగా కొనసాగిన వారే జిల్లా అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు అర్హులు. అలాంటిది ఆరు నెలల కిందట పార్టీలోకి వచ్చిన వారికి ఎలా అధ్యక్ష పదవిని కట్టబెడతారంటూ స్థానిక నేతలు కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ ఎదుట ప్రశ్నించినట్లు తెలిసింది. పార్టీ ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లా అధ్యక్ష పదవిని వికారాబాద్ జిల్లాకు చెందిన నాయకుల్లో ఎవరికి ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని, ఇతర జిల్లావాసికి ఎలా ఇస్తారంటూ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ జిల్లా అధ్యక్షుడిని మార్చేంత వరకు వదిలి పెట్టేది లేదని, అవసరమైతే సహాయ నిరాకరణకు సైతం సిద్ధమంటూ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిని నియమించడానికి దారి తీసిన పరిణామాల గురించి వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. పార్టీ నాయకులు లేవనెత్తిన అంశాలను విన్న ఆయన ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు.

### ఆశావహులకు నిరాశే!

పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి పలువురు నాయకులు పోటీ పడ్డారు. పార్టీ సీనియర్ నాయకులు కె.శివరాజ్, టి.సదానందరెడ్డి, కేపీ రాజు, యు.రమేష్‌కుమార్, వడ్ల నందు, డాక్టర్ రాజశేఖర్ తదితరులు

మిగతా 8వ పేజీలో...

### పార్టీ కార్యక్రమాలకు దూరంగా..

అధ్యక్షుడిగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిని మార్చాల్సిందేనంటూ పార్టీ సీనియర్ నాయకులు భీష్మించారు. పార్టీ అధ్యక్షుడిని మార్చేంత వరకు తాము పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ తమ నిరసన వ్యక్తం చేస్తామని స్పష్టం చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడి నియామకం కేడర్‌లో నూతనోత్సాహం నింపేదిలా ఉండాలే గానీ కొత్త నియామకం మాత్రం పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తోంది. రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు కూడా వెనకాడుతున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందనేది స్పష్టమవుతోంది. జిల్లా అధ్యక్ష పదవిని ఒకసారి ప్రకటించిన తర్వాత తిరిగి పునరాలోచన చేసే ఘటనలు ఇదివరకు చోటు చేసుకోలేదు. ఇదివరకు జిల్లా అధ్యక్షుడిగా సదానందరెడ్డిని నియమించిన సమయంలో కూడా కొందరు ఆయన నాయకత్వాన్ని వ్యతిరేకించారు. అధ్యక్షుడిని మార్చాలని పార్టీపై ఒత్తిడి తీసుకువచ్చినా ఫలితం లేకపోయింది. రాజశేఖర్‌రెడ్డిని అధ్యక్షుడిగా ప్రకటించిన అధిష్టానం సీనియర్ నాయకుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటుందా, లేదా? అనేది కమలం వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ముగిసిన ఇంటర్ పరీక్షలు

వికారాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్ జనరల్ పరీక్షలు ముగిశాయి. గురువారం జరిగిన సెకెండియర్ కామర్స్, కెమిస్ట్రీ, ఒకేషనల్ పరీక్షలకు 157 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు 7,086 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 6,929 మంది హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 5,949 మంది ఉండగా, వారిలో 5,830 మంది హాజరు కాగా, 119 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,137 మందికి 1,099 మంది హాజరు కాగా, 38 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ మెయిన్ కోర్సుల పరీక్షలు ముగియగా ఇప్పటివరకు జిల్లాలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాకపోవడం విశేషం. ఒకేషనల్ పరీక్షలు ఈనెల 25వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

సమాచారం

### యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థిక పురోగతిని పెంపొందించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాల కులాలకు చెందిన నిరుద్యోగ యువత హెచ్‌టీటీపీఎస్.టీజీఓబీఎమ్ఎమ్ఎస్ఎస్ఈ.సీజీజీ.ఇన్‌లో దరఖాసు చేసుకోవాలని సూచించారు. అన్ని వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. 5 ఏప్రిల్ 2025 వరకు దరఖాస్తుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌లో సంప్రదించవచ్చన్నారు.

# టెన్‌షన్ వద్దు

## విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఆలస్యానికి ఐదు నిమిషాల వెసులుబాటు
- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- మేడ్చల్ జిల్లాలో 230 పరీక్ష కేంద్రాలు.. 47,930 మంది విద్యార్థులు



మేడ్చల్‌లోని పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ విజయకుమారి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లో నిమిషం నిబంధన లేదు. విద్యార్థులు కేంద్రానికి ఉదయం 9 గంటలలోపు చేరుకోవాలి. ఐదు నిమిషాలు ఆలస్యమైనా లోనికి అనుమతిస్తారు. పాఠశాల యాజమాన్యంతో సంబంధం లేకుండా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.తెలంగాణ.జీవోవీ.ఇన్ లేదా డీజీఈ తెలంగాణ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని అధికారులు తెలిపారు. విద్యార్థులు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా

మిగతా 8వ పేజీలో...

### సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు

సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయి. చూచిరాతలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. విద్యార్థుల కోసం కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాం. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ వస్తువుల అనుమతి లేదు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి.

- విజయకుమారి, డీఈవో, మేడ్చల్

### కంట్రోల్ రూం నంబర్ 08416 - 235245

వికారాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పదో తరగతి పరీక్షలకు జిల్లాలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. నేడు(శుక్రవారం)జిల్లాలో 69 కేంద్రాల్లో 12,903 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్ష కేంద్రాలకు ఒక గంట ముందుగానే విద్యార్థులు చేరుకోవాలని విద్యా శాఖ అధికారులు సూచించడంతో పిల్లలు ఒత్తిడికి గురికాకుండా తల్లిదండ్రులు ముందురోజే పరీక్ష కేంద్రాలను చూయించారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా కంట్రోల్ రూం నంబర్ 08416-235245కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని డీఈవో రేణుకాదేవి సూచించారు.

### పటిష్ట బందోబస్తు



వికారాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశాం. కేంద్రాల వద్ద గుంపులుగా ఉండకూడదన్నారు. పరీక్షా సమయంలో కేంద్రాల దగ్గర్లో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలి. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య ఏర్పడితే డయల్ 100కి కాల్ చేసి తెలపాలి.

- నారాయణరెడ్డి, ఎస్పీ వికారాబాద్


జ్ఞానపీఠత్రయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

## తెలుగు సాహిత్యం అమూల్యమైనది

» తెలుగు సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యం అమూల్యమైనదని, జ్ఞానపీఠాన్ని అధిరోహించిన విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ సి.నారాయణరెడ్డి, డాక్టర్ రావూరి భరద్వాజ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు మరువలేనివని ప్రముఖ కవి, తెలుగు సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల(మహేంద్రహిల్స్)కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహిత్య సమాలోచన సదుస్సు ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అహర్నిశలు శ్రమించి, ఒక్కో మెట్టు ఎక్కుతూ జ్ఞానపీఠాన్ని అధిరోహించిన ముగ్గురూ తెలుగువారవడం గర్వకారణమన్నారు. తెలుగు సాహిత్యంపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలన్నారు. ముగ్గురి సాహిత్యాల గురించి వివరించారు. అనంతరం జ్ఞానపీఠ త్రయం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. 2012లో చివరగా డాక్టర్ రావూరి భరద్వాజ జ్ఞానపీఠ పురస్కారం దక్కిందని, ఇప్పటివరకు ఎవరికి రాలేదన్నారు. ఎంతో మంది తెలుగు సాహిత్యకారులు ఉన్నారని వారికి సైతం జ్ఞానపీఠ పురస్కారం రావాలని ఆకాంక్షించారు. సదస్సుకు హాజరైన అతిథులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, విమర్శకులు నాలేశ్వరం శంకరం, తూర్పు మల్లారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ, శ్రీరంగాచార్య, ప్రిన్సిపాల్ స్నేహలత, డాక్టర్ లక్ష్మీఅసిరెడ్డి, అధ్యాపకులు శారద, వెంకటేశ్వర్లు, రాధిక, అనురాధ, శ్రీభాష్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లలను కంటికి రెప్పలా కాపాడాలి

» రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ కార్యదర్శి అనితారామచంద్రన్



మాట్లాడుతున్న అనితా రామచంద్రన్

వికారాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చిన్నారులను కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, చిన్నారుల్లో వైకల్యం, తదితర అంశాలపై ఆమె సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, సఖి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు మంచి అలవాట్లపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులను వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతోనే ఇళ్లకు పంపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ సమస్యలతో బాధపడుతున్న 140 మంది చిన్నారుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారుల వివరాలను వారంలోగా సేకరించి శస్త్ర చికిత్సలు జరిగేలా కృషి చేయాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ శాఖ డైరెక్టర్ శైలజ, ఆర్‌జేడీ మోతి, డీపీవో జయసుధ, మానసిక వైద్యులు శ్రవణ్‌రెడ్డి, రుషికేష్ ఉన్నారు. పంపించాలని స్పష్టం చేశారు. దివ్యాంగ, అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్న చిన్నారుల జీవితాలు మెరుగుపరిచేందుకు అవసరమైన చికిత్సలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్, తాగునీరు, కరెంట్ వంటి సౌకర్యాలు మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రతిపాదనలు

## పూడూరులో ఉద్యాన మార్కెట్!

### 20 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు

హైవేపై స్థల సేకరణకు కసరత్తు.. జిల్లాలో 53,132 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు



పరిగి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యానవన మార్కెట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. జిల్లాలో పండ్లు, పూలు, కూరగాయ పంటల సాగు ఏటేటా పెరుగుతోంది. అయితే జిల్లాలో పండించిన పంటలను ఇక్కడే విక్రయించుకునేందుకు వీలుగా కొత్తగా హోల్‌సేల్, రిటైల్ మార్కెట్‌ను నిర్మించాలని మార్కెటింగ్ శాఖ కసరత్తు ప్రారంభించింది. మార్కెటింగ్ మంత్రిత్వశాఖ, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో ఈ మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో పండ్లు, కూరగాయల పంటలు 53,132 ఎకరాల్లో సాగవుతున్నాయి. ఈ పంటలు పండించే రైతులు స్థానికంగా మార్కెటింగ్ వసతి లేక హైదరాబాద్‌తోపాటు, వివిధ ప్రాంతాలకు వెళ్లి అమ్ముతున్నారు. ఈ క్రమంలో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

### రైతులే నేరుగా అమ్ముకునేలా..

కొత్తగా ఏర్పాటు చేయనున్న మార్కెట్‌ను హైవే, రైల్వే లైనుకు దగ్గరగా ఉండేవిధంగా స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులు భావిస్తున్నారు. పరిగి నియోజకవర్గపరిధిలోని పూడూరు మండల శివారు హైవేపై 20 ఎకరాల స్థలాన్ని సేకరించాలని మార్కెటింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ రోడ్డు పక్కన 20 ఎకరాల అనువైన స్థలాన్ని ఇప్పించాలని మార్కెటింగ్ శాఖ కలెక్టర్‌కు లేఖ రాసింది. క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేయాలని కలెక్టర్ కూడా రెవెన్యూ అధికాలను ఆదేశించినట్లు తెలిసింది. స్థల సేకరణ జరిగిన తర్వాత ఆ స్థలంలో మార్కెట్‌ను నిర్మించనున్నారు. పండ్లు, పూలు, కూరగాయలు నిల్వ చేసుకునేందుకు వీలుగా నిర్మాణాలు చేపట్టనున్నారు. పంటలను పండించిన రైతులే స్వయంగా హోల్‌సేల్, రిటైల్‌గా అమ్ముకునేందు వీలుగా అవకాశాలు కల్పించనున్నారు. రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా వ్యాపార లావాదేవీలు నిర్వహించేలా మార్కెట్ నిర్మించాలని మార్కెటింగ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. మార్కెట్ నిర్మాణం జరిగితే జిల్లా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

## ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలి

కందుకూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని, ఏడాదికి 200రోజుల పనికల్పించాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి జగన్, అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. గురువారం నాయకులు ఎ.కుమార్, బి.శ్రీనివాస్‌లతో కలిసి నేదునూరులో పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. ఈ ప్రాంతంలో పంటల సాగు తగ్గుతున్న నేపథ్యంలో ఉపాధి పనిదినాల సంఖ్యను పెంచాలన్నారు. కూలీలకు పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. 'ఆత్మీయ భరోసా'కు ఉపాధి హామీ లింక్‌ను తీసేయాలని డిమాండ్ చేశారు.



## పది పరీక్ష.. కంపచెట్లే రక్ష!

పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా కిటికీలకు తలుపులు లేకపోవడంతో నకల్ చిట్టీలు అందించకుండా ముళ్ల కంపలను అడ్డుగా ఉంచారు. షాద్‌నగర్ మండలం ఫరూఖ్‌నగర్ పాఠశాలలో శుక్రవారం(నేటి) నుంచి పది పరీక్షలు జరగనున్నాయి. దాంతో మాస్ కాపీయింగ్ జరగకుండా, అలాగే బయటి నుంచి ఎవరి సహకారం అందకుండా చేసేలా కంపచెట్లను కిటికీలకు అడ్డుగా ఉంచారు. దీంతో స్థానికులు దృశ్యాన్ని ఫోన్‌లో బంధిస్తున్నారు.

- షాద్‌నగర్ రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి)



రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మహేందర్

## ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేద్దాం

శంషాబాద్ రూరల్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ జెండాను ఎగరేద్దామని రంగారెడ్డి రూరల్ జిల్లా నూతన అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. గురువారం తన గెస్ట్‌హౌజ్‌లో కార్యకర్తలు ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలని చెప్పి పీఠమెక్కిన కాంగ్రెస్ పాలకులు ఒక్క హామీనైనా పూర్తిగా అమలు చేయలేదన్నారు. బీజేపీకి జిల్లాలో పూర్వవైభవం తెద్దామని రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. కలిసికట్టుగా పార్టీ కోసం కృషిచేద్దామని కోరారు. తాను కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. అంతకు ముందు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం, రాజేంద్రనగర్ బీజేపీ కన్వీనర్ మల్లేశ్, చేవెళ్ల పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి మల్లారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రొటోకాల్ జాయింట్ కన్వీనర్ యాదగిరి, అనంతయ్యగౌడ్, యాదగిరి, విజయ్, మురళి తదితర నాయకులు రాజ్‌భూపాల్‌గౌడ్‌కు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

## 'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి'

కేశంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లకు బీసీ-ఏలో చేర్చుతామని ప్రకటించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆ హామీని అమలు చేయాలని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లాదుర్గం సురేష్ డిమాండ్ చేశారు. గురువారం కేశంపేటలో ముదిరాజ్‌ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు బీసీ-ఏలో చేర్చి రిజర్వేషన్ పెంచాలని కోరారు. రిజర్వేషన్ పెరిగితేనే ముదిరాజ్‌లకు న్యాయమైన వాటా దక్కుతుందని తెలిపారు. ఇందుకు అన్ని పార్టీల నాయకులు ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కన్వీనర్ నారాయణ, జిల్లా యూత్ వింగ్ కన్వీనర్ శ్రీనివాస్, గోపాల్, జంగయ్య, చంద్రయ్య, యాదయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'మహాలక్ష్మి' అమలుతో ఆర్టీసీకి పెరిగిన ఆదరణ




కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి,మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి ఆదరణ పెరిగిందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన ఐదు బస్సులను ఆయన ప్రారంభించారు. రెండు మహబూబ్‌నగర్, రెండు షాద్‌నగర్, ఒకటి హైదరాబాద్ రూట్‌లో వెళ్తాయని చెప్పారు. వాటికి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆర్టీసీ లాభాల దిశగా పయనిస్తోందన్నారు. రోజూ రాష్ట్రంలో బస్సుల్లో 50లక్షలకుపైగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. రూ.60లక్షలతో పరిగి బస్‌స్టేషన్‌ను ఆధునీకీకరిస్తున్నామని తెలిపారు. డిపోకు కొత్తగా 17 బస్సులొచ్చాయన్నారు. పరిగిలోని కొత్త చెరువు పునర్నిర్మాణంతో మినీ ట్యాంకుబండ్‌గా రూపుదిద్దుతామన్నారు. పరిగి-లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులకు త్వరలోనే సీఎం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పార్థసారథి, బి.పరశురాంరెడ్డి, ఆంజనేయులు, ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కె.హన్మంత్, ఇ.కృష్ణ, ఆనందం. బి.భీంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, భరత్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

## హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

ధారూరు, మార్చి20(ఆంధ్రజ్యోతి):పాత కక్షలతో దంపతులను హత్య చేసి, మరొకరిపై హత్యాయత్నం చేసిన కేసులో ఐదుగురికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ వికారాబాద్ కోర్టు గురువారం తీర్పునిచ్చిందని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ధారూరు మండలం నాగసమందర్‌కు చెందిన చౌట మల్లేశం తన తల్లితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని చౌట వెంకటేశం.. మల్లేశాన్ని హతమర్చాడు. దీంతో మల్లేశం కుటుంబీకులు వెంకటేశం కుటుంబంపై కక్షపెంచుకున్నారు. 2012న డిసెంబరు 24న చౌట బందెప్ప మరో ఆరుగురితో కలిసి మారణాయుధాలతో చౌట బాలప్ప ఇంట్లోకి చొరబడి దాడిచేశారు. దీంతో బాలప్ప తల్లిదండ్రులు చిన్న నర్సింహులు, అంజమ్మ మృతిచెందారు. బాలప్ప అక్క బాలమణి అడ్డు వెళ్లగా ఆమెపైనా దాడిచేశాడు. ఈ ప్రతీకార హత్య కేసును అప్పటి ఎస్‌హెచ్‌వో ఎం.రమేశ్ నిందితులపై కేసులు నమోదు చేశారు. విచారణాధికారులు లచ్చీరామ్, విజయ్‌లాల్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వివరాలను పరిశీలించిన జిల్లా సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తీర్పు ఇచ్చారు. నిందితులు చౌటలక్ష్మి, కుర్వ గోపాల్, కుర్వ అంజయ్య, చౌట పెంటమ్మ, కుర్వ లక్ష్మిలకు జీవిత ఖైదు, రూ.2వేలా జరిమానా విధించారు. బాలమణిపై హత్యాయత్నానికి పాల్పడినందుకు నిందితులకు పదేళ్ల కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. కేసును పకడ్బందీగా విచారణ చేసి నిందితులకు శిక్ష పడేలా పనిచేసిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు. ఇదిలా ఉంటే కేసు నిందితుడు ఉన్న బందెప్ప అనారోగ్యంతో ఇప్పటికే మృతిచెందాడు.

## ఉపన్యాస పోటీల్లో ఐదోస్థానం



తాండూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ ఎడ్యుకేషన్ పోటీలను నిర్వహించారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అంశంపై తాండూరు సింధూడిగ్రీ కాలేజీ బీఎస్సీ-ఎంపీసీ ఫైనలియర్ విద్యార్థిని ఆర్.శివలీల ఐదోస్థానంలో నిలిచింది.

ఆమనగల్లు మున్సిపాలిటీ

## తైబజార్ @ రూ.34లక్షలు

- బల్దియాకు భారీగా ఆదాయం

ఆమనగల్లు, మార్చి20(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం తైబజార్ వేలం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి కమిషనర్ శంకర్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన వేలంలో 31మంది డిపాజిటర్లు పాల్గొన్నారు. వేలంలో గతేడాది రూ.13.05లక్షల ఆదాయం ఎక్కువొచ్చింది. ఈ ఏడాది తైబజార్ వేలం మినిమం ప్రైజ్ రూ.14.90లక్షలను నిర్దేశించారు. లక్ష్యానికి మించి ఆదాయం లభించింది. ఆమనగల్లుకు చెందిన జెన్నెల గిరియాదవ్, నాగిళ్ల జగన్ వేలంలో చివరివరకు పోటీపడ్డారు. రూ.34లక్షలకు గిరియాదవ్ వేలాన్ని దక్కించుకున్నారు. మున్సిపాలిటీకి గతం కంటే రూ.26.95లక్షలు ఎక్కువ ఆదాయం సమకూరనుంది. వేలంలో సిండికేట్ వ్యూహం ఫలించలేదు. అలాగే చికెన్ వ్యర్థాల వేలాన్ని రూ.4.1లక్షలకు మానుపాటి నర్సింహ దక్కించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ దామోదర్, రామకృష్ణ, నాయకులు, టెండర్‌దారులు పాల్గొన్నారు.

## బోధనపై నిర్లక్ష్యం

- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు
- నష్టపోతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



విద్యార్థులను తరగతి గదిలో కూర్చోబెట్టిన స్కావెంజర్ రామాంజమ్మ

చౌదరిగూడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర ప్రాథమిక పాఠశాలలో టీచర్లు సమయపాలన పాటించడంలేదు. గురువారం ఉదయం ఒంటిపూట ఉదయం 7:50 నుంచి 12:30 వరకే స్కూలు ఉన్నా ఉపాధ్యాయులు సమయానికి రాలేదు. ఈ పాఠశాలలో 63 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులున్నారు. ప్రార్థన సమయానికి ఇద్దరే టీచర్లు వచ్చారు. నలుగురిలో ఒకరు డిప్యూటేషన్‌పై రావిర్యాల పాఠశాలకు వెళ్లారని తెలిసింది. ఇక హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి టైంకు రాలేదు. ప్రార్థన అనంతరం కొందరు పిల్లలు ఊరికే తరగతి గదిలో కూర్చోగా.. 1 ,2, 3 తరగతుల విద్యార్థులను స్కావెంజర్ రామాంజమ్మ మరో గదిలో కూర్చోబెట్టారు. ఈ పరిస్థితి రోజూ ఉంటోందని విద్యార్థులు, వారి తల్లితండ్రులు తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాబోధన బాగా చేస్తున్నామని టీచర్లు, ప్రభుత్వం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిల్లో కొన్నిచోట్ల ఇలాంటి పరిస్థితి ఉంది. వేలల్లో జీతాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు వారి వృత్తికి న్యాయం చేయాలని గ్రామస్థులు అంటున్నారు. ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు బాగా బోధిస్తేనే ఉన్నత తరగతుల్లో వారు మెరుగ్గా రాణిస్తారన్నారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# అసైన్డ్ భూమిపై రియల్టర్ కన్ను

- అక్రమంగా కాంపౌండ్ వాల్ నిర్మాణం
- రెవెన్యూ అధికారుల చర్యలపై అనుమానాలు




తాండూరు-హైదరాబాద్ రోడ్డులో అసైన్డ్ భూమికి వేసిన కాంపౌండ్ వాల్

తాండూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తాండూరులో విలువైన ప్రభుత్వ/అసైన్డ్/వివాదాస్పద భూములపై రియల్టర్లు కన్నేస్తున్నారు. నాయకుల అండదండలు, రెవెన్యూ అధికారులు అవినీతితో భూములను కొల్లగొడుతున్నారు. పేదలకు పంచిన(అసైన్డ్)భూములు, వివాదంలో ఉన్న భుములకు ఎంతోకొంత ముట్టజెప్పి స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటికే తాండూరులో వివాదాస్పద భూములు, పాట్లను సొంత చేసుకొని రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. తాజాగా తాండూరు-హైదరాబాద్ రోడ్డులోని ఖాంజాపూర్ గేటు సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న అసైన్డ్ భూమికి కాంపౌండ్ నిర్మించారు. యాలాల మండలం కోకట్ పరిధి సర్వే నంబర్ 64/40లో ఎకరానికిపైగా ఉన్న అసైన్డ్ భూమిపై రియల్టర్ల కన్ను పడింది. దానికి కాంపౌండ్ కట్టారు. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో మొదట రెవెన్యూ అధికారులు స్పందించినా చర్యలకు వెనకాడుతున్నారు. ఈ నెల 1న కాంపౌండ్ కూల్చేందుకు వచ్చిన అధికారులకు భూ యజమాని నాలుగురోజుల్లో కాంపౌండ్‌ను తొలగిస్తామని రాసివ్వడంతో అధికారులు వెనక్కి తగ్గారు. తర్వాత స్థల యజమాని ఈ నెల 24వ తేదీ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు నుంచి ఇన్‌జంక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నాడు. దీనిపై రెవెన్యూ అధికారులు కౌంటర్ దాఖలు చేయలేదు.

### నిబంధనలు తుంగలో తొక్కి ...

అసైన్డ్ భూమి అమ్మేందుకు గానీ, వ్యవసాయేతర అవసరాలకు వాడుకునేందుకు గానీ అనుమతి లేదు. సాగుకోసమే ప్రభుత్వం పేదలకు భూమి పంచుతుంది. ఇక్కడ అధికారులు చర్యలకు పూనుకున్నా ఇప్పుడు మిన్నకుంటున్నారు. హైదరాబాద్ రోడ్డులోని భూములపై రియల్టర్ల కన్ను పడింది. అసైన్డ్ భూములను పట్టా చేసుకుంటూ ప్లాట్లుగా చేస్తున్నారు. గతంలో ఈ భూమిని ఖేల్ ఇండియా ఆటల నిర్వహణకు, ఆటోనగర్ కోసం కేటాయించారని స్థానికులు చెబుతున్నారు. ఆటోనగర్‌కు చెందిన కొందరు ఇది తమ స్థలమనీ అంటున్నారు. గతంలో ఇక్కడ పశువులషెడ్లు వేసేందుకు పంచాయతీ అనుమతికి ప్రయత్నాలు చేశారు.

### పకడ్బందీగా కౌంటర్ దాఖలు చేస్తాం



అసైన్డ్ భూమి అన్యాక్రాంతం కాకుండా కోర్టులో కౌంటర్ దాఖలు చేస్తాం. రెండు రోజుల్లో కౌంటర్ వేసేందుకు పత్రాలను సేకరించాం. అసైన్డ్ భూమిలో నిర్మాణాలు చేపట్టొద్దు. హైదరాబాద్ రోడ్డు భూమిలో వేసిన కడీలను తొలగిస్తామని భూయజమాని రాసిచ్చినా తొలగించలేదు. ఆ కడీలను తీయకుంటే ప్రభుత్వం విధించే చర్యలకు ఒప్పుకుంటూ అతడు రాసిచ్చాడు. దీనిపై శాఖాపరంగా కోర్టులో అప్పీలు చేస్తాం.

- అంజయ్య, తహసీల్దార్, యాలాల



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న లక్ష్మారెడ్డి

## సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల కుటుంబాల్లో వెలుగులు

మహేశ్వరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదల కుటుంబాల్లో చిరుదీపాలు వెలుగుతున్నాయని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రావిర్యాలకు చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ప్రజల వైద్య ఖర్చులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఉపయోగపడుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రూ.1,000కోట్లకుపైగా విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిందన్నారు. సమసమాజ నిర్మాణంతోనే అభివృద్ధి సాధ్యం అని కేఎల్లార్ అన్నారు. అసెంబ్లీల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపు, రాజీవ్ యువ వికాసం వంటి మూడు కార్యక్రమాలు చరిత్రలో నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, వైస్‌చైర్మన్ యాదయ్య, నాయకులు పాండురంగారెడ్డి, యాదయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి రజిత్‌కుమార్ పాల్గొన్నారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- నిర్మాణంలోని కన్వెన్షన్ దగ్ధం.. రూ.6కోట్ల మేర నష్టం



శంషాబాద్ రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి ఈకేఏఎం కన్వెన్షన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తొండుపల్లికి చెందిన మహేశ్‌యాదవ్ తన పొలంలో ఈకేఏఎం పేరుతో కన్వెన్షన్ నిర్మిస్తున్నాడు. 90శాతం పనులు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 10 గంటల సమయంలో వర్కర్లు పనిచేస్తుండగా షార్ట్‌సర్క్యూటై మంటలు చెలరేగాయి. వెంటనే యాజమాని ఫైర్ స్టేషన్‌కు కాల్ చేశారు. అప్పటికే మంటలు వ్యాపించాయి. రెండు ఫైరింజన్లతో మంటలార్పారు. దాదాపు ఈ ప్రమాదంలో రూ.6కోట్ల నుంచి రూ.7కోట్ల ఆస్తినష్టం జరిగిందని మహేశ్ పోలీసులకు తెలిపారు. ఏప్రిల్‌లో కన్వెన్షన్‌ను ప్రారంభించాల్సి ఉందని అతడు ఆవేదన వ్యక్తం చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ నరేందర్‌రెడ్డి, ఎస్సై సర్దార్ పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమీ లేదు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకిచ్చిన గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందని, బీఆర్‌ఎస్‌ను బలహీన పర్చడం కాంగ్రెస్ తరం కాదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. గురువారం సిరిగిరిపురానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు దయ్యాల శ్రీను ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సబిత మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పాలనలో చేసిన పనులేమీ కన్పించడం లేదన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీలను అమలుచేసే వరకు కాంగ్రెస్‌ను నిలదీయాలన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడమే కాంగ్రెస్ పాలకులు చేసిన అభివృద్ధి అని విమర్శించారు. గ్రామాల్లో సర్పంచులు లేక ఎక్కడి పనులు అక్కడే నిలిచాయన్నారు. కనీసం పారిశుధ్య నిర్వహణనూ పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేని అసమర్థ స్థితిలో ఉన్న ఈ ప్రభుత్వం మరో నాలుగేండ్లు ఎలా పాలిస్తారని ప్రశ్నించారు. అభివృద్ధి పేరిట నియోజకవర్గ ప్రజలను కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రలోభాలకు గురిచేస్తున్నారని, ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో బండ నర్సింహ, శ్రీకాంత్, వెంకటేశ్, శ్రీను, పి.బాలయ్య, జగన్, మహేశ్, టిల్లు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## చేసేదే చెబుతాం.. చెప్పింది చేస్తాం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేశంకర్

షాద్‌నగర్, మార్చి20(ఆంధ్రజ్యోతి): 'చేసేదే చెబుతాం.. చెప్పింది చేస్తాం.. ఇది మా ప్రభుత్వ విధానం. విమర్శలకు తావులేకుండా హామీలన్నీ నెరవేరుస్తున్నాం. రిజర్వేషన్ వర్గీకరణతో మాదిగలను రారాజులను చేశాం. 42శాతం రిజర్వేషన్‌తో బీసీలకు పెద్దపీట వేశాం. మాటకు కట్టుబడి ఉన్నాం. గత పాలకుల మాదిరి చెప్పేదొకటి.. చేసేదొకటి ఉండదు.' అని గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోంటే ఓర్వలేని కొందరు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ తీర్మాన ఘనత ఎవరిదో విపక్షాలు చెప్పాలన్నారు. కాంగ్రెస్ పాలనలో మాదిగలకు మంచి రోజులొచ్చాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించి ప్రభుత్వంలోకి వచ్చి అమలుకు నిర్ణయం తీసుకుందని, ఈ బిల్లును పార్లమెంట్ ఆమోదిస్తే బీసీల బతుకులు మారతాయన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారన్నారు. దశాబ్ద కాలంగా అసంపూర్తిగా ఉన్న ఘనీకృత పశువీర్య ఉత్పత్తి కేంద్రానికి రూ.21.6కోట్లు కేటాయించి పాడి రైతులకు తోడ్పాటందిస్తామన్నారు. దళితుడిని సీఎం చేస్తానన్న కేసీఆర్ ఎంత మాటకారో? చిత్తశుద్ధి ఏమిటో దళితులు గుర్తించాలన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

## గ్రామసభను బహిష్కరించిన నిర్వాసితులు

- హైవే విస్తరణను తూంకుంటలో 100 మీటర్లకు కుదించాలని ఆందోళన



తూంకుంటలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శామీర్‌పేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గ్రామ సభకు జిల్లా అధికారులు ఆలస్యంగా రావడంతో భూ నిర్వాసితులు బహిష్కరించారు. దీంతో అధికారులు గ్రామసభను వాయిదా వేశారు. రాజీవ్ రహదారిని జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకై ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం తూంకుంటలో జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్, హెచ్‌ఎండీఏ ఓఎస్డీ మనోహర్ నిర్వాసితులకు పరిహారం, పునరావాసంపై గ్రామసభ తలపెట్టారు. ఉదయం 10:30గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద సభ నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, అధికారి శంకర్‌కుమార్‌లు రాకపోవడంతో ప్రజలు మధ్యాహ్నం 12:30గంటల వరకు వేచి చూసి సభను బహిష్కరిస్తున్నట్టు చెప్పి వెళ్లిపోయారు. కాగా గ్రామస్తులు వెళ్లిన తరువాత మధ్యాహ్నం 12:39 సమయంలో అధికారులు గ్రామసభకు వచ్చారు. మళ్లీ రావల్సిందిగా అధికారులు, తహసీల్దార్ యాదగిరిరెడ్డి గ్రామస్తులను కోరాని వారు రాలేదు. దీంతో గ్రామ సభను ఈ నెల 28న ఉదయం 10:30గంటలకు నిర్వహిస్తామని, అధికారులు ప్రకటించి వెళ్లిపోయారు. ఇదిలా ఉంటే కాగా గ్రామ సభను బహిష్కరించిన అనంతరం భూ బాధితుల అసోసియేషన్ అధ్యక్షుడు కాసుల సుభాష్ ఆధ్వర్యంలో భూ నిర్వాసితులు తూంకుంట రాజీవ్‌రహదారి వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ప్రభుత్వం ప్రకటించినట్లు రాజీవ్‌రహదారి విస్తరణకు 200 మీటర్ల స్థలం సేకరణ కాకుండా 100 మీటర్ల మేరకు మాత్రమే భూ సేకరణ చేయాలని భూ నిర్వాసితులు ఆందోళన చేశారు. 200 మీటర్ల వరకు భూ సేకరణ చేస్తే పెద్ద ఎత్తున ఇండ్లు, ఇళ్ల స్థలాలను దారుణంగా కోల్పోతున్నామని భూ బాధితులు, మహిళలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు.

## పరిహారమివ్వకుండానే భూసేకరణ

కందుకూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీల పేరుతో ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల భూములు లాక్కొని నట్టేటముంచుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం రాచులూరు, గాజులబుర్జు తండాల్లో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కంటే సీఎం రేవంత్‌రెడ్డి రెండు రెట్లు అధికంగా రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 25, 26న ఆకులమైలారం నుంచి అన్నోజిగూడ, మీర్కాన్‌పేట, బేగరికంచ, సాయిరెడ్డిగూడ, యాచారం మండలం కుర్మిద్ద, మేడిపల్లి, నానక్‌నగర్ వరకు బాధిత రైతులను చైతన్యపర్చేందుకు జీపుజాత నిర్వహిస్తామని తెలిపారు. 27న కందుకూరు, యాచారం మండలాల్లోని రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేస్తామని యాదయ్య తెలిపారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.రాంచందర్, కవిత, జగన్, మధుసూదన్‌రెడ్డి, బాల్‌రాజ్, చందు, నరసింహ, శ్రీశైలం, కృష్ణ నర్సింహ, బి.శ్రీనివాస్ ఉన్నారు.

## ఇళ్ల పట్టాలిచ్చేవరకూ పోరాటం

చేవెళ్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో గుడిసెలేసుకున్న వారికి ప్రభుత్వం వెంటనే ఇళ్లపట్టాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. గురువారం చేవెళ్లలో పేదలతో కలిసి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ... చేవెళ్లలోని 75సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిలో పేదలు రెండేళ్లుగా గుడిసెల్లో ఉంటున్నారని చెప్పారు. వారికి అదే జాగలో పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ హామీ మేరకు ప్రతీ పేదమహిళకు నెలనెలా రూ.2,500 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి,రామస్వామి, ప్రభులింగం, సత్తిరెడ్డి, శ్రీనివాస్, జంగయ్య, సుధీర్, వడ్ల సత్యనారాయణచారి, అంజయ్య, శివ, గోపాల్‌రెడ్డి, జలీల్, మక్బూల్, రమాదేవి, సుగుణమ్మ, పెంటయ్య, జయమ్మ, భాగ్యమ్మ, యాదమ్మ, ఎలీషా, బీరప్ప, సత్యనారాయణ, శ్రీకాంత్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాల్లో 'ఇందిరమ్మ ఇళ్ల'కు అడుగులు



తాండూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణాలకు అధికారులు ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికే దరఖాస్తులను పరిశీలించారు. గురువారం గృహనిర్మాణ శాఖ తాండూరు డివిజన్ డీఈ, ఏఈలు మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. యాప్‌లో నమోదు చేసిన వారిలో అర్హులను గుర్తించాలని సూచించారు. వారం రోజుల్లో గృహ నిర్మాణ శాఖ అధికారులు కార్యాచరణ చేపట్టనున్నారు. తాండూరు మున్సిపాలిటీలో 600 మంది వరకు ఖాళీ స్థలాలున్నట్టు గుర్తించారు. ఇప్పటికే గ్రామాల్లో గ్రౌండింగ్ ప్రారంభమైంది.

## భానుడి భగభగ


వెలవెలబోతున్న బషీరాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తా

బషీరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయి. భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మండలంలో గురువారం అత్యధిక ఉష్ణోగ్రత 39.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. నిత్యం జనంతో రద్దీగా ఉండే అంబేడ్కర్ చౌరస్తా, మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో నిర్మానుష్యంగా మారిపోయింది.

## నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

బషీరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని బషీరాబాద్ ఎంపీవో జయకర్ సూచించారు. మండలంలోని ఎక్మాయి, నీళ్లపల్లి, జలాల్‌పూర్ గ్రామ పంచాయతీల్లో గురువారం ఆయన పర్యటించారు. అక్కడక్కడా పారిశుధ్యం మెరుగ్గా లేకపోవడంతో కార్యదర్శులకు వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు.

**క్రైం కార్నర్**

### ‘వేధింపులు భరించలేకే చంపేశాం’

పెద్దేముల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగివచ్చి తమను వేధిస్తుండడంతోనే భరించలేక హత్యచేశామని అత్తా, కోడలు నేరం అంగీకరించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని హన్మాపూర్‌లో గురువారం బక్కని వెంకటేష్ అనుమానాస్పద మృతిపై మృతుడి తమ్ముడు శ్రీనివాస్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి తల్లి, భార్యనే వెంకటేష్‌ను ఐరన్‌రాడ్డుతో తలపై బలంగా కొట్టి హత్యచేసినట్లు నేరాన్ని ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

# వరికి తెగులు.. రైతన్న గుబులు

- రంగు మారుతున్న పంట
- ఆందోళనలో రైతులు

బొంరాస్‌పేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఏ పంట సాగు చేసినా మద్దతు ధర వస్తుందో రాదోనని వరి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే వరి పంట సైతం అంతుచిక్కని తెగుళ్లతో రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఓ వైపు వేసవి ఎండలు, బోర్లలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. సాగుచేసిన పంటలు పండుతాయో లేదోనని రైతులు ఆందోళనలో ఉన్నారు. వరి తెగుళ్ల ఆశించి రైతులను కలవరపెడుతుంది. బొంరాస్‌పేట్ మండల వ్యాప్తంగా అన్ని చెరువుల్లోకి నీరు రావడంతో బొంరాస్‌పేట్‌తో పాటు మెట్లకుంట, బురాన్‌పూర్, కొత్తూర్, ఏర్పుమళ్ల, రేగడిమైలారం, దుద్యాల మండలంలో చెరువుల కింద వరి పంటలను సాగు చేశారు. బొంరాస్‌పేట్ మండలంలో 4వేల ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేస్తున్నారు. దుద్యాల మండలంలో మరో వేయి ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు.


బొంరాస్‌పేట్‌లో పసుపు రంగులోకి మారిన వరి పొలం

### అంతుచిక్కని తెగుళ్లు

సాధారణంగా వరిలో కాండం తొలుచు పురుగుతో పాటు అగ్గి తెగులు గురించి రైతులకు కాస్త అవగాహన ఉంటుంది. కానీ ఈ సంవత్సరం సూక్ష్మ ధాతువు లోపం కారణంగా వరి పంటలో నూతన తెగుళ్ల సోకుతున్నాయి. నాటు వేసిన కొత్తలో జింకు లోపంతో వరి పంట పసుపు రంగులోకి మారి నష్టానికి దారి తీయగా ప్రస్తుతం చిరుపొట్ట దశలో తిరిగి పంటలు పసుపు పచ్చగా మారడంతో పాటు అగ్గి తెగులు సోకడంతో వరి పైరు పిలకలన్నీ పసుపు రంగులోకి మారడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎన్నీ మందులు సూచించినా పంట కోలుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయిఇప్పటికే ఒక్కో రైతు మూడు సార్లు మందులు పిచికారి చేసినా ఆందోళనతోనే ఉన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేయాలని కోరుతున్నారు.

**మూడు సార్లు మందు పిచికారీ చేశాను**



నాటు వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు మందులు పిచికారి చేశాను. అయినా ఫలితం కనిపించడం లేదు. ఈసారి పెట్టుబడి రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తెగులు నివారణకు సలహాలు, సూచనలు చేయాలి. **- కోస్గి రాజు, రైతు, బొంరాస్‌పేట్**

**మందు పిచికారీ చేస్తే పంట ఎర్రబడింది**



నాటు వేసిన మొదట్లో కలుపు మందు పిచికారి చేశాను. అప్పటి నుంచి పంట ఎరుపుగా మారింది. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోతుంది. అధికారులు పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు చేయాలి.

**- రైతు హన్మయ్య, బొంరాస్‌పేట్**

**సూక్ష్మధాతువు లోపం వల్లే..**



బొంరాస్‌పేట్‌లో ప్రధానంగా సూక్ష్మధాతువు లోపం కారణంగా వరి పంట తెగులుకు గురి అవుతుంది. అక్కడక్కడ అగ్గి తెగులు కూడా కనిపిస్తుంది. ప్రస్తుతం పంటలన్నీ చిరుపొట్ట దశలో ఉండటంతో సూక్ష్మధాతువు నివారణ కోసం పిచికారి కోసం ఫార్ములా-4, యూరియాతో కలిపి ఫార్ములా-7ను వాడాలి. అగ్గి తెగులు నివారణ కోసం ట్రై సైక్లోజోన్ మందును పిచికారి చేస్తే తెగులును నివారించవచ్చు. రైతులు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదు. వ్యవసాయ అధికారులను సంప్రదించి తెగులు నివారణ కోసం సలహాలు, సూచనలు చేస్తారు.

**- తులసి, వ్యవసాయ అధికారి, బొంరాస్‌పేట్**

## టీఎన్జీవోస్ డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం యూనియన్ సహకార, పంచాయతీ కార్యదర్శుల డైరీ, క్యాలెండర్లను గురువారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి అజ్మత్ పాషా, కోశాధికారి రమేష్, అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహులు, వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ యూనిట్ల అధ్యక్షులు మల్లేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, వెంకటేష్, కొండన్న, సహకార, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు చేయూత


పేద విద్యార్థికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

పరిగి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కొప్పుల హరీశ్వర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు చేయూతనందిస్తామని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్నాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి సుంకరి శ్రీనివాస్ కూతురు శ్రీలక్ష్మీ మెడికల్ సీటు సాధించిన సందర్భంగా గురువారం రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎం.అశోక్, సురేందర్, అరవింద్‌రావు, ఆర్.ఆంజనేయులు, నాయకులు బి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మాణిక్య, కృష్ణ, విజయ్, సంతోష్ పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి అండగా సీఎంఆర్ఎఫ్


చెక్కులు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక కడా కార్యాలయంలో గురువారం కడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్, రఘువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రామలింగేశ్వరస్వామి జాతర

కులకచర్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారిని బండవెల్కిచర్ల నుంచి పాంబండపైకి భజనలు, కోలాటంతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. గురువారం ఆలయంలో రుద్రహోమం నిర్వహించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య, పాండు శర్మలు కార్యక్రమాలు నిర్వహించారు.

## పరిగి ఆర్టీసీ డీఎంగా సుఖేందర్‌రెడ్డి

పరిగి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పరిగి డిపో మేనేజర్‌గా సుఖేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కరుణశ్రీ బదిలీపై కామారెడ్డి డిపోకు వెళ్లారు. సిద్దిపేట్ డీఎంగా పనిచేస్తున్న సుఖేందర్‌రెడ్డి బదిలీపై పరిగికి వచ్చారు.

# ‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


తాండూరు రూరల్: విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తాండూరు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. ఆయన గురువారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. తాండూరులో 13పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం(నేడు) 2,745మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12.30గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. తాండూరులో ఏర్పాటు చేసిన 13 పరీక్షా కేంద్రాల్లో 2,745 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల కోసం 26 మంది ఎగ్జామ్ ఆఫీసర్లు, 136మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు.

### పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

పదో తరగతి పరీక్షా కేంద్రాలను తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పరిశీలించారు. నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్న పరీక్షల్లో భాగంగా మండల పరిధిలోని కరన్‌కోట్, మల్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను పరీక్షా కేంద్రాలకు కేటాయించారు. ఈ కేంద్రాలను గురువారం డీఎస్పీ పరిశీలించి పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. అక్కడ సౌకర్యాలపై డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తామని డీఎస్పీ తెలిపారు. మల్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ పరీక్షా కేంద్రంలో 196 మంది విద్యార్థులు, కరన్‌కోట్ జెడ్పీహెచ్ఎస్ పరీక్షా కేంద్రంలో 165 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ వైద్యనాథ్ తెలిపారు. ఒక చీఫ్ సూపరింటెండెంట్, 10 మంది ఇనివిజిలేటర్లు నియమించడంతోపాటు ఎనిమిది గదులను పరీక్షల కోసం కేటాయించడం జరిగిందన్నారు. డీఎస్పీ వెంట కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ఉన్నారు.

కోట్‌పల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోట్‌పల్లి పరీక్షా కేంద్రంలో 187మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సెంటర్‌ను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో డానియల్ పరిశీలించారు.

కులకచర్ల: పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో హబీబ్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 778 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. కులకచర్ల బాలుర పాఠశాలలో 200, బాలికల పాఠశాలలో 183, పుట్టపహడ్‌లో 195, ముజాహిద్‌పూర్‌లో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి విద్యార్థులు గురువారం పాంబండ దేవాలయాన్ని సందర్శించారు. శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

బషీరాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షలకు మండల వ్యాప్తంగా 424 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు బషీరాబాద్ విద్యాధికారి దూసరాములు గురువారం తెలిపారు. ఈ పరీక్షలను బాలురు 209, బాలికలు 215 మంది వ్రాస్తున్నారన్నారు. బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు), తెలంగాణ మోడల్ స్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇద్దరు చీఫ్ సూపరింటెండెట్లు, ఇద్దరు డిపార్టుమెంట్ అధికారులతో పాటు కస్టోడియన్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షిస్తారని తెలిపారు. అదేవిధంగా నేటి నుంచి ఏప్రిల్ 4వరకు మండలంలో నిర్వహిస్తున్న పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ధారూరు: నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు మండలంలో 292 మంది విద్యార్థులు హాజరుకానున్నారని మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండలంలోని 9 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ధారూరు బాలుర ఉన్నత పాఠశాల, కేరెల్లి ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ధారూరులో 151 మంది, కేరెల్లిలో 141 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని , పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు.


దోమ: సీటింగ్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో వెంకట్

మోమిన్‌పేట్: ఈ నెల 21న (శుక్రవారం) నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో మల్లేశం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొత్తం 157 మంది బాలురు, 170 మంది బాలికలు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఘట్‌కేసర్ రూరల్: నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి శ్రీధర్ తెలిపారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలలో 8 పరీక్ష కేంద్రాల్లో 1,423 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఘట్‌కేసర్‌లోని బాలికల, బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలు, కొర్రెములలోని జిల్లా పరిషత్ పాఠశాల, అన్నోజిగూడలోని జిల్లా పరిషత్ పాఠశాల, ఘట్‌కేసర్‌లోని విద్యాకిరణ్, సెయింట్ అంటోని, హోలీపేత్, శ్రీచంద్రా స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరిగి: నేటి గురువారం నుంచి జరగనున్న టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో గోపాల్ తెలిపారు. ఎట్టణంలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ కేంద్రాల్లో 1950 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

దోమ: నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో వెంకట్ తెలిపారు. గురువారం పరీక్షా కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. దోమ మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 452 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. దోమ, దాదాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బొంరాస్‌పేట్: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో హరిలాల్ తెలిపారు. గురువారం ఆయన బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల వ్యాప్తంగా రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 486 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

# కమలంలో కల్లోలం!

(ఐదో పేజీ తరువాయి)

అధ్యక్ష పదవిని ఆశించారు. ఆశావహుల మధ్య చర్చల అనంతరం చివరకు అధ్యక్ష పదవి రేసులో శివరాజ్, రమేష్‌కుమార్‌లు మిగలగా, వారిద్దరిలో శివరాజ్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయనేది పార్టీ వర్గాల్లో ప్రచారమైంది. పార్టీలో సుదీర్ఘకాలంగా కొనసాగుతూ వచ్చినా ఒకసారి పార్టీ మారారనే అంశం తాండూరుకు చెందిన రమేష్‌కుమార్‌కు మైనస్‌గా మారినట్లు తెలిసింది. జిల్లా అధ్యక్ష పదవికి ఎవరిని ఎంపిక చేయాలనేది పార్టీకి సవాల్‌గా మారింది ఓ దశలో. ఇంతకుముందు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన కొకట్ మాధవరెడ్డినే మళ్లీ కొనసాగించాలని పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలు యోచించారు. అయితే రెండోసారి అధ్యక్ష పదవిలో కొనసాగాలన్న ప్రతిపాదనలను మాధవరెడ్డి అంగీకరించలేదని తెలిసింది. అయితే పార్టీ అధిష్టానం డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో ఆశావహులతో పాటు ముఖ్య నాయకులు కంగుతిన్నారు. తమలో ఎవరికో ఒకరికి అధ్యక్ష పదవి దక్కుతుందని ఆశించిన ఆశావహులకు పార్టీ అధిష్టానం తమ నిర్ణయంతో షాక్ ఇచ్చింది.

# ‘టెన్’షన్ వద్దు

(ఐదో పేజీ తరువాయి)

పరీక్షలకు హాజరవ్వాలని సూచించారు. జిల్లాలో 230 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 47,930 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 47,322 మంది రెగ్యులర్, 608 మంది ప్రైవేట్ విద్యార్థులున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 15, చీఫ్ సూపరింటెండెంట్లు 230, డిపార్ట్‌మెంటల్ అధికారులు 234, ఇన్విజిలేటర్లు 2769 మంది, ఎనిమిది రూట్లలో ఎనిమిది మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. ప్రైవేట్‌గా రాసే వారికి ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీరు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్స మందులు సిద్ధంగా ఉంచారు.

### 24 పేజీల బుక్‌లెట్

పదో తరగతి పరీక్షలకు ఈసారి 24 పేజీల ఆన్సర్ బుక్ లెట్ ఇవ్వనున్నారు. అడిషనల్ షీట్ అవసరం లేకుండా బుక్ లెట్ సరిపోతుంది. ప్రశ్నాపత్రంపై క్యూఆర్ కోడ్‌తోపాటు ఒక సీరియర్ నంబర్ ప్రతి పేజీపైన ఉంటుంది. దీంతో ఎక్కడైనా ప్రశ్నాపత్రం లీక్ అయితే వెంటనే తెలిసిపోతుంది. జిల్లాకు వచ్చిన పరీక్షా పత్రాలను 21 పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు. సైన్స్ పేపర్(పార్ట్ 1, 2) మాత్రం 9.30 గంటల నుంచి 11 గంటల వరకే నిర్వహించనున్నారు. సీసీ కెమెరాల నిఘాలోనే ప్రశ్నాపత్రాలను ఓపెన్ చేయనున్నారు.

### మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలి: కలెక్టర్

వికారాబాద్: పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చూడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లలకి సెల్‌ఫోన్లను అనుమతించొద్దని, కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలన్నారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి అనుమతించాలని సూచించారు. పరీక్షలు జరిగే అన్ని రోజుల్లో అధికారులకు సెలవులు ఇవ్వకూడదన్నారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, విద్యా విద్యాధికారి రేణుకాదేవి పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

కీసర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని సీపీఐ మేడ్చల్ నియోజకవర్గం కార్యదర్శి తోటపల్లి శంకర్ ఆరోపించారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి చీర్యాల్ గ్రామంలో గురువారం సీపీఐ రైతు సంఘం మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా కీసర గ్రామానికి చెందిన సీపీఐ రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం పలువురి రైతులను రైతు మహాసంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

# వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

- సీఎం, స్పీకర్ చిత్రపటాలకు పాలాభిషేకం

వికారాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మున్సిపాలిటీలోని స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా కూడలి వద్ద ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవ ఆమోదం చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్ పాల్గొన్నారు.

పెద్దేముల్: మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిల చిత్రపటాలకు యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే బీసీ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు రియాజ్, రాము, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: కాంగ్రెస్ కులకచర్ల మండల మాజీ అధ్యక్షుడు తిరుమలాపూర్ వెంకటయ్యగౌడ్, నర్సింహులుగౌడ్, అమృతయ్యగౌడ్, వెంకటేశ్ ముదిరాజ్, వెంకటయ్య యాదవ్ బీసీలకు రిజర్వేషన్‌పై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్‌లతో పాటు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం హర్షణీయమన్నారు.


వికారాబాద్: సీఎం, స్పీకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

కీసర: అసెంబ్లీలో బుధవారం బీసీలు, ఎస్సీలకు రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపిన సందర్భంగా గురువారం చీర్యాల్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల వారికి సముచిత స్థానం కల్పిస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములు, మేడ్చల్ అరవింద్, నర్సింగ్‌రావు, నవీన్, రాజు పాల్గొన్నారు.


కీసర: చీర్యాల్‌లో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**రిజర్వాయర్ నిర్మాణంపై సంబురాలు**

పరిగి: పరిగి-లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడాన్ని హర్షిస్తూ గురువారం పరిగిలోని ఇందిరాగాంధీ విగ్రహం దగ్గర సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పరిగి ఏఎంసీ‌ఈ చైర్మన్ పరశురాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాంచంద్రయ్య, వెంకటేశ్, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# తైబజార్ @ రూ.12.7లక్షలు



కొడంగల్: తైబజారుకు వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

కొడంగల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బలరాంనాయక్ ఆధ్వర్యంలో గురువారం తైబజారు వేలం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన తైబజారు వేలంలో పట్టణానికి చెందిన నీలకంఠ, సయ్యద్ నసీర్‌పాష, నాగరాజు, శివకుమార్ పాల్గొన్నారు. వేలంలో పోటీపడగా రూ.12,70,000కు నీలకంఠ దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు ధారూరులో వేలం

ధారూరు: ఈనెల 21న ధారూరు తైబజారు వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అంజానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం ప్రారంభమవుతుందని తెలిపారు. తైబజారు వేలం కాలపరిమితి ఏప్రిల్ 01, 2025ల నుంచి మార్చి 31, 2026 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.10వేలు దరావత్ చెల్లించాలని, పంచాయతీకి బకాయిలున్న వారు వేలంలో పాల్గొనడానికి అనర్హులని ఆయన తెలిపారు.

### రేపు కులకచర్లలో..

కులకచర్ల: ఈ నెల 22న కులకచర్ల గ్రామ తైబజారు వేలం నిర్వహించనున్నట్లు ఎంపీవో భాస్కర్ గౌడ్ గురువారం తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.50వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. గతంలో బకాయిలు ఉన్న వారు వేలంకు అనర్హులని తెలిపారు. ఏ కారణం చేతైనా వేలం రద్దు చేసే అర్హత ఎంపీవోకు, కార్యదర్శికి ఉంటుందని తెలిపారు. వేలంలో దక్కించుకున్న వారు సంవత్సరం పాటు తైబజారు వసూలు చేసుకోవచ్చునని తెలిపారు.

## సంక్షిప్తంగా..

### రేషన్‌కార్డు నిబంధన తొలగించాలి

యాలాల: రాజీవ్ యువ వికాస్ పథకానికి రేషన్ కార్డు నిబంధన తొలగించాలని సీపీఎం యాలాల మండల కార్యదర్శి యు.బుగ్గప్ప కోరారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. వెంటనే ప్రభుత్వం రేషన్ కార్డు లేకపోయినా అప్లికేషన్ దరఖాస్తు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

తాండూరు: 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఎస్సీ వర్గీకరణ సాధించిన పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి గురువారం తాండూరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు మాదిగ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి, టపాకాయలు కాల్చి సంబురాలు నిర్వహించారు.

### వీరశైవ యువదళ్ నూతన కార్యవర్గం

వికారాబాద్: వికారాబాద్, ఆలంపల్లిలోని కెంపిన్ మఠంలో బుధవారం సాయంత్రం శ్రీచెన్న బసవప్రభు స్వాముల ఆధ్వర్యంలో వీరశైవ యువదళ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటిలింగం, ఉపాధ్యక్షులుగా అమర్, హరీష్, కోశాధికారిగా గాండ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శిగా, భానుచందర్‌ను ప్రచారకర్తగా నియమించారు. ముఖ్య సలహాదారులుగా కిషోర్, జి. బసవేశ్వర్ స్వామి, మఠం చంద్రశేఖర్ స్వామి, అశోక్ స్వామి, రాకేష్ స్వామి, ఉప్పు అమర్నాథ్, పత్తి రాజేష్, శ్రావణ్‌లను ఎంపిక చేశారు. అలాగే, సుధీర్ పటేల్, జగదీష్, సంతోష్ శ్రీశైలం, విజయ్, శంకర్‌లను కార్యవర్గ సభ్యులుగా చేర్చారు.

### విద్యార్థులకు క్విజ్ పోటీలు

పరిగి: మండలంలోని గడిసింగాపూర్ స్కూల్ కాంప్లెక్స్‌లో గురువారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. క్విజ్‌పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.